క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలను నోడల్ అధికారి వెంకటయ్య తనిఖీ చేశారు. ప్రాథమిక స్థాయి విద్యాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎల్ఎస్ తొలిమెట్టు కార్యక్రమం విజయవంతం అవడం సంతోషకరమన్నారు. ఆయా పాఠశాలలోని 6, 7వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు వంట ఏజెన్సీలు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు.

యువత క్రీడల్లో రాణించాలి

మాగనూర్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మక్తల్ సీఐ సీతయ్య అన్నారు. శుక్రవారం మాగనూర్ ఎస్ఐ నరేందర్ మండలంలోని నేరడగం, కొత్తపల్లి గ్రామాల్లోని యువకులు క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తుండటంతో వారిని ప్రోత్సహించేందుకు తన వంతుగా రూ.15 వేలతో పాటుగా డ్రెస్‌లను ఉచితంగా సీఐ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. యువత క్రీడల్లో రాణించడంతో చదువును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. రాబోవు రోజుల్లో వచ్చే ఉద్యోగ నోటిఫికేషన్లలో యువత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు ప్రక్రియను శుక్రవారం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వీధికి ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కేశవులు, వెంకట్‌రెడ్డి, రాములు, వెంకటయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత



నారాయణపేట రూరల్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు స్థానిక ప్రభుత్వ పాఠశాలకు శుక్రవారం మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మొల్గాన్‌జనార్దన్ మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలకు మైక్‌సెట్ అవసరం ఉన్నందున వారు సమకూర్చి ఇవ్వడంపై అభినందించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, మత్స్యసహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

‘నిధి ఆప్కే నికత్’పై అవగాహన

నారాయణపేట రూరల్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఉద్యోగులు, యజమానులకు నిధి ఆప్కే నికత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రామసుబ్బయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ మఠం రాజశేఖర్‌లు హాజరై మాట్లాడారు. ఉద్యోగులు, వివిధ పరిశ్రమలు, ఇతర వ్యాపార సంస్థల్లో పనిస్తున్న వారికి అందించే పీఎఫ్‌పై సందేహాలను నివృత్తి చేశారు. పీఎఫ్ వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రతి నెల 27న ఇలాంటి సమావేశాలు జరుగుతాయని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆపరేషన్ స్మైల్ బృందం దాడులు

నారాయణపేట రూరల్: ఆపరేషన్ స్మైల్ బృందాలు శుక్రవారం నారాయణపేట, మద్దూర్ మండలాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్ దుకాణం, హోటళ్లు, వెల్డింగ్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర చోట్ల పనిచేస్తున్న తొమ్మిది మంది బాల కార్మికులను గుర్తించారు. వీరిలో ఆరుగురు బాలురు, ముగ్గురు బాలికలు ఉన్నారు. బాల కార్మికులను సీడబ్ల్యూయూసీ కార్యాలయంలో అప్పగించారు. పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పర్చి కౌన్సెలింగ్ ఇస్తామని ఎస్పీ పేర్కొన్నారు. దుకాణ యజమానులను జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

శ్రీశైలానికి తరలిన మహిళలు

మరికల్: శ్రీశైలం పుణ్యక్షేత్రంలో పది రోజుల పాటు సేవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం పల్లెగడ్డకు చెందిన టీటీడీ మహిళ సభ్యులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీటీడీ సభ్యులు శ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తిరుపతి, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు వివిధ రకల సేవలను అందించేందుకు తరలివెళ్తారని పేర్కొన్నారు.

‘కంటి వెలుగు’పై నిర్లక్ష్యం సహించం



బాపన్‌పల్లి కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

దామరగిద్ద: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బాపన్‌పల్లిలో కంటి వెలుగు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, అద్దాల పంపిణీ, ఆపరేషన్‌కు సిఫార్సుకు చేసిన వారి వివరాలు, మందుల పంపిణీ వంటి వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు. కలెక్టర్ వెంట మండల అధికారులు ఉన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలోని సీఎస్‌సీ సెంటర్, కొత్తపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. కంటివెలుగు పరీక్షలపై డాక్టర్ శ్రీలత, ఎంపీడీఓ విజయలక్ష్మిలను అడిగి తెలుసుకున్నారు. సీఎస్‌సీ సెంటర్ నుంచి మరో చోటుకు శిబిరంను మార్చాలను సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ జ్యోతి తదితరులున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్స్3, 4కు సంబంధించి స్థానిక చిట్టెం నర్సిరెడ్డి డిగ్రీ కళాశాలలో బీసీ విద్యార్థులకు రెండు నెలల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు సందర్భంగా శుక్రవారం అభ్యర్థులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి డి.క్రిష్ణమాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గట్టుతిమ్మప్ప స్వామి ప్రభోత్సవం



మాద్వార్‌లో గట్టు తిమ్మప్పస్వామి తేరును లాగుతున్న భక్తులు

మక్తల్: మండలంలోని మాద్వార్‌లో తిరుమల తిరుపతి స్వామి, శ్రీగట్టుతిమ్మప్పస్వామి (లక్ష్మీవేంకటేశ్వరస్వామి) ప్రభోత్సవం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారిని కొండపైకి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గతంలోకంటే ఈ సారి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మక్తల్ ఎస్ఐ పర్వతాలు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కృష్ణా: మండలంలోని టై రోడ్డులో శుక్రవారం స్థానిక పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటూ వాహనానికి సంబంధించిన పత్రాలు వెంబడే ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. ఇందులో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా గరుడ స్తంభ ప్రతిష్ఠాపన



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ శివాలయం ఎదుట శుక్రవారం నూతన గరుడ స్తంభాన్ని వేద మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగా వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఆలయంలో రుద్రాభిషేకం, హోమం నిర్వహించారు. అదే విధంగా కడెచూర్ పీఠాధిపతి శ్రీ గురుమూర్తి శివాచార్య మహాస్వామి హాజరై భక్తుల తమ భక్తి సందేశాలను అందించారు. సిద్రాంరెడ్డి, గుండప్ప, ఆంజనేయులు, పునే లక్ష్మణ్, సంగమేశ్వర్, మజ్జిగ సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఎస్పీ నాయకులు

దామరగిద్ద: మండలంలోని గత్పలో బాలిక మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. శుక్రవారం గత్పలో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి మాట్లాడారు. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో బాలిక ఆత్మహత్యకు పాల్పిడిందని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు నిందితుడిని కాపాడుతున్నారని ఆరోపించారు. పరామర్శించిన వారిలో బీఎస్పీ పార్టీ నాయకులు ఉన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు మెండు



యల్సన్‌పల్లిలో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ స్వప్న

దామరగిద్ద: చిరుధాన్యాలలో పోషకాలు అధికంగా ఉంటాయని ఏఈఓ అరవింద్, ఏఓలు స్వప్నలు అన్నారు. 2023 సంవత్సరం చిరుధాన్యాల సంవత్సరంగా ఎంపికైన సందర్భంగా మండలంలోని యల్సన్‌పల్లి, దామరగిద్ద, తదితర క్లస్టర్ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల దినోత్సవాన్ని నిర్వహించారు. రాగులు, సజ్జలు, కొర్రలు వంటి చిరధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలను వివరించారు. ప్రజా ప్రతినిధులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

థామస్ అల్వా ఎడిసన్‌కు నివాళి



మరికల్: విద్యుత్ బల్బును కనుకొన్న థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి మండల ఎలక్ట్రిషన్ సంఘం ఆధ్వర్యంలో నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ బల్బుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. థామస్ సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, మల్లేష్, వెంకటేష్, శ్రీను, సూరి, రాఘువేంద్ర, రవి, రాజు, చారీ, రఘునాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

నారాయణపేట రూరల్: గవర్నర్‌పై ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళ అనే గౌరవం లేకుండా ఇష్టారీతిగా మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని ఎమ్మెల్సీ అవమానపరిచారన్నారు. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి బహిరంగంగా గవర్నర్ తమిళిసైకి క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ప్రభుత్వం అతడిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నర్సమ్మ, విశాలక్ష్మి, అనూష, ప్రమీళ, జయశ్రీ, భారతమ్మ పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో సాయి విజయ్ కాలనీలో వెలసిన సద్గురువు షిరిడీ సాయి బాబా విగ్రహ ప్రతిష్ఠాపన, 11వ వార్షికోత్సవాలు, రథసప్తమి వేడుకలను శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం బాబాకు క్షీరాభిషేకం, పుష్పార్చనలు చేపట్టి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ వెంకటేశ్వర్లు, అడిషనల్ కలెక్టర్ మయంక్ మిట్టల్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ చంద్రకాంత్, వైస్‌చైర్మన్ హరినారాయణ్‌భట్టడ్ హాజరవుతారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వ్యక్తిగత విమర్శలు సహించం



మాట్లాడుతున్న రఘురామయ్యగౌడ్

నారాయణపేట రూరల్: బీజేపీ నాయకులను వ్యక్తిగతంగా విమర్శిస్తే సహించమని ఆ పార్టీ లీగల్‌సెల్ కన్వీనర్ నందునామాజీ, పట్టణ అధ్యక్షుడు రఘురామయ్యగౌడ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతో మందికి రాజకీయ భిక్ష పెట్టిన బీజేపీ సీనియర్ నాయకుడు నాగురావునామాజీపై విమర్శలు చేయడం తగదన్నారు. కమలం పార్టీలో ఎదిగి పదవులు స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారిన చైర్మన్లు, కౌన్సిలర్లు నామాజీపై వ్యక్తిగత ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేతో కలిసి జీఓ 69ని అమలు చేయించాలని కోరారు. కృష్ణ-వికారాబాద్ లైన్, పాలమూరు డీపీఆర్‌పై మంత్రులు సమాధానం ఇవ్వాలన్నారు. సమావేశంలో శ్రీనివాస్, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు శ్రీగట్టు తిమ్మప్పస్వామి రథోత్సవం

మక్తల్: పేదల తిరుపతిగా వెలుగొందుతూ మాద్వార్ సమీపంలోని నల్లకొండల్లో వెలసిన నామాల శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి (గట్టు తిమ్మప్ప) రథోత్సవం శనివారం కనులపండువగా ఏర్పాటు చేయనున్నట్లు ఉత్సవ నిర్వాహకుడు రాజేశ్వర్‌రావు తెలిపారు. గట్టు తిమ్మప్పస్వామి ఉత్సవాలు ఈనెల 26 నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 11గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకు స్వామివారి రథోత్సవం, ఆదివారం పాల ఉట్లు, సోమవారం గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కర్నిలో గుండు రంగస్వామి రథోత్సవం

మండలంలోని కర్ని గ్రామం సమీపంలో రెండు గుహల మధ్య వెలసిన గుండురంగస్వామి రథోత్సవాన్ని శనివారం 6 గంటలకు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బీడీ కార్మికులను ఆదుకోవాలి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిధి ఆప్కే నికత్ అదాలత్ సందర్భంగా హాజరైన ప్రావిడెంట్ ఫండ్ నోడల్ అధికారి రాజశేఖర్‌కు శుక్రవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ కఠిన నిబంధనలు ఎత్తివేసి బీడీ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. పీఎఫ్‌లో పేర్లు, వయస్సు సరిచేయాలని కోరారు. పీఎఫ్ ఎన్‌రోల్ చేసిన కార్మికులు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు పెంటన్న, బాలయ్య ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ధన్వాడ: మండల కేంద్రానికి చెందిన రైతు గువ్వలి వెంకట్‌రాములు పొలంలో విద్యుదాఘాతంతో శుక్రవారం ఎద్దు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయం నుంచి తక్షణ సాయం కింద రూ.40వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో రైతుకు అందజేశారు. జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతుకు ఆర్థికసాయం అందిచడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారి మల్లేష్, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి వెంకోబా, అనంతరెడ్డి, శ్రీనివాస్, అశోక్‌గౌడ్ ఉన్నారు.



అపరిచిత వ్యక్తులతో అప్రమత్తత అవసరం



వాడ్వట్‌లో సైబర్ నేరాలపై అవగహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

మాగనూర్: అపరిచిత వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాగనూర్ ఏఎస్ఐ మన్నాన్ అన్నారు. శుక్రవారం కళాబృందంతో కలిసి ఆయన మండలంలోని వాడ్వట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు కాల్ చేసి మీకు లాటరీలు తగిలాయి, లోన్స్ ఇస్తామని, తక్కువ ధరకే ఆన్‌లైన్‌లో వస్తువులు వస్తాయని కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లేదంటే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులపై అనుమానం ఉన్న వెంటనే డయల్ 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, ఎవరైనా గుట్కాలు, గంజాయి అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలుపాలని, వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు పరిమితి వేగంలో వెళ్లాలని, తప్పకుండా హెల్మెట్, సీటు బెల్టు ధరించడంతో పాటు రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కానిస్టేబుళ్లు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీ సెక్రెటరీకి సన్మానం



శ్యాంసుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నర్వ: జిల్లా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ప్రశంసాపత్రం అందుకున్న పాథర్చేడ్ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డిని శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్యదర్శిగా ప్రజలకు ఎల్లవేళలో అందుబాటులో ఉండి సేవలు అందించడంపై జిల్లా యంత్రాంగం ఆయన సేవలను గుర్తించిందన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు మరింత సేవలు అందించే అవకాశం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యాంలాల్, విండో డైరెక్టర్ పల్లె శేఖర్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహ, ఎస్ఎంసీ చైర్మన్ రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ఇద్దరికి గాయాలు



మక్తల్: కందుల ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరి గాయాలైన సంఘటన పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సత్యవార్ గ్రామానికి చెందిన రైతులు కందులు విక్రయించేందుకు ట్రాక్టర్‌పై వస్తుండగా.. వెనుక భాగాన ట్రాక్టర్ ఎక్సాల్ విరిగిపోవడంతో బోల్తాపడి ఇద్దరి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



కోటకొండ పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ శైలజ

నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే బీద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషిచేయాలని డీఐఓ డాక్టర్ శైలజ అన్నారు. శుక్రవారం మండలంలోని కోటకొండ పీహెచ్‌సీని అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. ఓపీకి వచ్చే రోగులతో మర్యాదగా మాట్లాడాలని, గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన మందులు, ఇంజక్షన్లు సమయానికి ఇస్తు నార్మల్ డెలవరీకి ప్రయత్నం చేయడం, పిల్లల ఆరోగ్యానికి సంబందించిన సూచనలు చేయాలన్నారు. ప్రైవేటుకు వెళ్లకుండా ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కల్పించాలన్నారు. కంటి వెలుగు నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ సునంద, ఎంపీహెచ్ఈఓ అశోక్‌రాజు, ఎంపీహెచ్ఎస్ వెంకటేష్, సిబ్బంది శ్రీనివాసులు, శ్రీధర్, సీతారాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



డిమాండ్ల కూడిన వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మద్దూరు: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని డిమాండ్ చేస్తూ మద్దూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యూటీని అమలు చేయాలని, 2017 నుంచి టీఏడీఏలు ఇవ్వడం లేదని, 2015 నుంచి ఆరోగ్య లక్ష్మి చార్జీలు పెంచకపోవడం కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. అలాగే పోషణ్ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్, రికార్డ్స్ తదితర వాటిలతో ఒకే సమాచారం పెట్టడంతో అంగన్‌వాడీలకు పనిభారం పెరిగిపోయిందన్నారు. 2018లో కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరుతో అంగన్‌వాడీలకు గంటకో ఫొటో పెట్టాలని అధికారులు వేధిస్తున్నారని ఇలాంటి మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఐసీడీఎస్ సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ బలరాం, నాయకులు జోషి, ఆశప్ప, అంగన్‌వాడీలు శశికళ, పుష్ప, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ సస్పెండ్ చేయాలి



మరికల్: జాతీయ జెండాను అవమాన పర్చిన వారికి ఉన్నత అధికారి మద్దతు పలకడం న్యాయం కాదని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ బాలస్వామి, రఘునాథ్ అన్నారు. మరికల్ మండలం పల్లెగడ్డ అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం జరిగిన గణతంత్ర వేడుకల్లో అంగన్‌వాడీ టీచర్ ఎస్తేర్ జాతీయ జెండాను ఎగరవేయకుండా అవమాన పర్చిందంటూ.. ఆ విషయాన్ని శుక్రవారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు నారాయణపేటలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చూడగానే కలెక్టర్ తమపై అసహనం వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. తగిన విచారణ జరిపించి అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరగా.. అక్కడ ఉన్న సిబ్బంది తమతో వాగ్వివాదానికి దిగారని తెలిపారు. సదరు టీచర్‌పై చర్య తీసుకోకపోతే ఈ విషయాన్ని చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేస్తామన్నారు. పల్లెగడ్డ అంగన్‌వాడీ కేంద్రం వద్ద వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన చేసి ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శేఖర్, అనిల్, ఆంజనేయులు, రాము, పాల్గొన్నారు.